

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# న్యూరాలజీలో లావణ్యకు బంగారం పతకం



**నెల్లూరు, జులై 20, ప్రభాతవార్త – వైద్యం** వెంకటాచలం మండలం చెముదుగుంటకు చెందిన వైద్యురాలు కుంకాల లావణ్య వైద్య విద్యలో బంగారు పతకం సాధించారు. చెన్నైలోని శ్రీ రామచంద్రా మెడికల్ కళాశాలలో డీఎం (న్యూరాలజీ) చదువుతున్న లావణ్య ఆ విభాగంలో ప్రథమంగా నిలిచారు. దీంతో విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో చండీగఢ్‌కి చెందిన అమిటి విశ్వవిద్యాలయ ఉపకులపతి సెల్వమూర్తి, చెన్నై శ్రీ రామచంద్రా విశ్వవిద్యాలయ కులపతి వీఆర్ వెంకటాచలం చేతుల మీదుగా ఆమె బంగారు పతకాన్ని అందుకున్నారు. చెముదుగుంటకు చెందిన, ఎనెల్ హాస్పిటల్ ఛైర్మన్‌గా ఉన్న కుంకాల దశరథ నాగేంద్ర ప్రసాద్ కుమార్తె, ఎనెల్ ఆసుపత్రి ఎండి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు కులారి నాగేంద్ర ప్రసాద్ సతీమణి అయిన లావణ్య మొదటి నుంచి విద్యలో చురుకుగా ఉండేవారు. నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన లావణ్య, బెంగళూరులోని సెంట్ మార్థాస్ హాస్పిటల్లో డీఎన్బీ పీజీ పూర్తి చేశారు. ప్రస్తుతం చెన్నై శ్రీ రామచంద్రా మెడికల్ కళాశాలలో డిఎం న్యూరాలజీ పూర్తి చేశారు. లావణ్య ప్రస్తుతం నెల్లూరులోని ఎనెల్ ఆసుపత్రిలో న్యూరాలజీ విభాగ వైద్యురాలుగా పని చేస్తున్నారు. బంగారు పతకం అందుకున్న లావణ్యను తోటి వైద్యులు, స్థానికులు అభినందించారు.

# సూపర్ సిక్స్ పథకాలు విజయవంతమవ్వాలని

## ఆరు భారీ రొట్టెలను పట్టుకున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు అర్బన్, జులై 20, ప్రభాతవార్త** అపార పరిపాలనానుభవం గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలవుతాయని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బారాషహీద్ దర్గారొట్టెల పండుగ నాల్గవ రోజున రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం కావాలని కోరుతూ శాసన సభ్యులు శ్రీధర్ రెడ్డి ఆరు భారీ రొట్టెలను పట్టుకున్నారు. తొలుత బారాషహీద్ దర్గాలో పూజలు చేసిన అనంతరం స్వర్ణాల చెరువులో సూపర్ సిక్స్ పథకాల పేర్లతో వినూత్నంగా ఏర్పాటు చేసిన ఆరు భారీ రొట్టెలను పట్టుకుని మనో సంకల్పంతో అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రొట్టెల పండుగకు నిన్ననే వర్చువల్‌గా హాజరైన బారాషహీద్ దర్గా ప్రార్ధనా మందిరానికి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలన్నారు. ముఖ్యమంత్రి కున్న దార్శనికత, అనుభవంతో గాడితప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పట్టాలెక్కిస్తారని, ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుతూ సూపర్ సిక్స్ పథకాలు విజయవంతమవ్వాలని కోరుకుంటూ ఆరు భారీ రొట్టెలను పట్టుకోవడం జరిగిందన్నారు. బారా షహీద్ రొట్టెల పండుగ పై తనకు సంపూర్ణ విశ్వాసముందని, గత సంవత్సరం చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ రొట్టె పట్టుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పథకాలు విజయవంతమవ్వాలని ఆశిస్తూ రొట్టెలు పట్టుకున్నామని, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో ఖచ్చితంగా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రొట్టెల పండుగ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఖాదర్ భాషా, మాజీ మేయర్ భానుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.9.42లక్షలు



**వలేటివారిపాలెం జూలై 20, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. తద్వారా సా ్వమివారికి రూ.9,42,196 లు మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ, రఘురామారావులు భక్తులకు తీర్థప్ర సాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.5,350 లు,కుం కుమార్చన పూజల ద్వారా రూ.25,920లు, ,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.31,550 లు,వాహనపూ జల వలన రూ.4,400లు, ప్రత్యేకదర్శనం రూ.1,63,000లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వల న రూ.740లు,రూముల అద్దెలు రూ.29,910లు,కవర్లు అమ్మకం వలన రూ.4,200లు, అన్నదానం నిమిత్తం రూ.4,78,225లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,78,785లు, విరాళాలు 20,116,లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు తెలిపారు.

## వైభవంగా పల్లకి సేవ



కోవూరు జూలై 20 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు నాగవల్లి పత్రాల తో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మాజీ సీడీసీ ఛైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, భక్తులు ఉన్నారు. పల్లకి సేవ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గాదిరాజు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## ఈ నెల 22 వ తేది నుండి ప్రత్యేక గ్రామసభలు

చేజర్ల జులై 20 ప్రభాతవార్త చేజర్ల మండలంలోని 26 గ్రామ పంచాయితీలలో ఈనెల 22 వ తేది నుండి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపిడిఓ విజయలలితా శనివారం ఒకప్రకటన ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా పంచాయితీ రాజ్ కమీషన్ వారి ఆదేశాల మేరకు ఈనెల 22 నుండి26 వ తేది వరకు ప్రత్యేక గ్రామ సభలు అన్ని గ్రామాల పంచాయితీలలో నిర్వహించినున్నట్లు తెలిపారు.త్రాగునీరు పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించినున్నట్లు తెలిపారు.ఈ గ్రామ సభలను ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

**నెల్లూరు క్రైం, జులై 20, ప్రభాతవార్త** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే నడిరోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పై సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా, మృతుడు స్థానిక నవాబుపేట పుల్లమ్మ సత్రంకు చెందిన ప్రభాకర్ (49)గా గుర్తించారు. మృతుడు ఆటో డ్రైవర్‌గా జీవనోపాధి సాగిస్తూ ఉన్నారు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ సంంఘటనపై సమోదు చేసుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

# దర్గా పరిసరాలు, పోలీసు కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్







**నెల్లూరు అర్బన్, జులై 20, ప్రభాతవార్త** బారాషహీద్ దర్గా ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం రొట్టెల పండుగ సంధర్భంగా బారాషహీద్ దర్గా పరిసరాలు, పోలీసు కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దర్గా పరిసరాలను పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రంగా ఉంచుతున్నారని, సుమారు అయిదు వేలకు పైగా కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారని, రొట్టెల పండుగ పూర్తి అయ్యే వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. పోలీసు కంట్రోల్ రూమ్‌లో బారాషహీద్ దర్గా ప్రాంతాల్లో శాంతిభద్రతలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పిక్ పికెట్టింగ్ పై గట్టి నిఘా ఉంచాలని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పోలీస్ యంత్రాంగం నిఘా పెట్టిందని, ఏ చిన్న ఘటన జరగకుండా మరింత అప్రమత్తంగా పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తప్పిపోయిన వారిని వెంటనే గుర్తించి వారి సంబంధికులకు అప్పగించడం పట్ల పోలీసులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రిసెప్షన్ సెంటర్లలో కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రొట్టెల పండుగ పూర్తి అయ్యే వరకు భక్తులకు తాగునీరు నిరంతరం అందించాలని ఆయన సూచించారు. స్నానాల ఘాట్లు వద్ద నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. అదివారం జరిగే రొట్టెల పండుగ ముగింపు వేడుకలకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శర్మద, సిటి ప్లానర్ దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పరారీలో ఫోర్జరీ నిందితులు

## రంగంలోకి దిగిన పోలీసు బృందాలు

**నెల్లూరు క్రైం, జులై 20, ప్రభాతవార్త** ప్రజలు ఇచ్చిన అవకాశంతో ప్రజాధనానికి కాపలా కాయాల్సిన ప్రజాప్రతినిధులే కంచే చేను మేసిన విధంగా కార్పొరేషన్‌ను దోచుకున్నారు. అధికారం మాటున చేసిన అవినీతి పనులు ఒక్కొక్కటిగా తెర ముందుకు వస్తుండడంతో దాక్కుంటున్నారు. ఇదే కోవలో నెల్లూరు కార్పొరేషన్‌లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడిన ప్రజా ప్రతినిధులు, వారికి వంత పాడిన ఉద్యోగులు ఇప్పుడు కటకటాల మాటకు వెళ్లే కాలం సమీపించడంతో బిక్కుబిక్కుమంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ కానీ ఫోర్జరీ చేసిన కేసులో నిందితులకు ఉచ్చు బిగుసుకుంటుంది. వీరిపై స్థానిక దర్గా మిట్ట పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదయింది.

**ఎఫ్ఐఆర్ నమోదుతో కీలక నిందితులు పరారు :** కార్పొరేషన్ ఫోర్జరీ కేసులో నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు కావడంతో నిధులు నెల్లూరు నగరం విడిచిపెట్టి వెళ్లినట్లు సమాచారం. మొత్తం 7 మంది నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదయింది. వీరిందరిపై 120 (బి) 420, 467, 468, 471 ఆర్/డబ్ల్యూ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ప్రధాన నిందితులైన మేయర్ భర్త జయవర్ధన్, ఆయన అసిస్టెంట్ శివకృష్ణ మరో నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. వీరిని అరెస్టు చేసేందుకు రంగంలోకి ప్రత్యేక పోలీసుబృందాలను రంగంలోకి దించారు. కార్పొరేషన్ కమిషనర్ సంత కాన్నే ఫోర్జరీ చేసిన వీరంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. సుమారు రెండు నెలల వరకు బెయిల్ వచ్చే అవకాశం లేకుండా సెక్ష న్లు నమోదు చేయడంతోనే వీరు కనపడకకుండా అజ్ఞాతంలోకి పోయినట్లు స్పష్టమవుతుంది. వీరితో పాటు మరో ఏడుగురు కార్పొరేటర్లు ఓ సహకార సంస్థ ఛైర్మన్ పాత్ర పై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం.కార్పొరేషన్ కమిషనర్లసంతకాల ఫోర్జరీకి సంబంధించి ఇప్పటికే తమ తప్పు ఒప్పు కొని తమపై మేయర్ భర్త జయవర్ధన్ శివకృష్ణలు ఒత్తిడి తీసుకురావడం వల్లే ఈ పని చేశామని సస్పె న్షన్‌కు గురైనకార్పొరేషన్ ఉద్యోగులుకొందరు పోలీ సులకు వాంగ్మూలం ఇచ్చి నట్లుసమాచారం. నెల్లూరు కార్పొరేషన్‌లో జరిగిన ఈ ఫోర్జరీ సంతకాల సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారడం ప్రభుత్వం ఈ సంఘటన పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

# గురుకుల పాఠశాలను అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



కొడవలూరు జూలై 20 ప్రభాతవార్త: కొడవలూరు మండలంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆనంద్ శనివారం పరిశీలించారు. కొడవలూరు పర్యటనలో భాగంగా ఆయన స్థానిక గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధ్యార్థుల సంఖ్యా వారికి అందిస్తున్న వసతి, సౌకర్యాలను ప్రాధానోపధ్యాయుల దేవసహాయంను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక సిబ్బంది హాజర్ పట్టికను , పలురిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వంట గది, స్టోర్ రూమ్, మరుగు దొడ్లు, విధ్యార్ధు వసతి గదులను మరియు తరగతి గదులను పరిశీలించారు. 8వతరగతి గదిలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్, వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. బోర్డుపై గణిత సమస్య రాసి పరిష్కరించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు క్రమంతప్పకుండా వైద్యసేవలు అందిస్తున్నారా అని వైద్యశాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక డాక్టర్ విజిటింగ్ రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందిచేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమిళ, ఎంఇవో వంసతకుమారి, అంకయ్య, హెచ్ఎం దేవ సహాయం తహసీల్దారు శైలేంద్ర కుమార్, తదితరు పాల్గోన్నారు.

# పట్టపగలే దొంగతనం

## - 15 సవర్లు నగలు అపహరణ- బీరువాను కాల్చివేసిన దొంగలు





కోవూరు జూలై 20 ప్రభాతవార్త : పట్టపగలే గుర్తు తెలియని దొంగలు ఓ ఇంట్లో ఎవరు లేని విషయాన్ని గమనించి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు పగలకొట్టి లాకర్‌లో ఉన్న 15 సవర్ల నగల బ్యాగ్‌ను అపహరించుకుపోయిన సంఘటన కోవూరు పంచాయతీ పరిధిలోని రేగడితూము పల్లిపాలెం ప్రాంతంలో శనివారం నెలకొంది. ఈ ప్రాంతానికి చెందిన ఎం. సుజాతమ్మ శనివారం ఇంటికి తాళం వేసి తమ కుమారుడితో కలిసి గ్యాస్‌కు తంబ్ వేసేందుకు కోవూరుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి మేడపై ఉన్న బీరువా తాళాలు పగలకొట్టి లాకర్‌లో ఉన్న 15 సవర్ల నగల బ్యాగ్‌ను అపహరించుకుపోయారు.ఈ గుర్తు తెలియని దొంగలు వెళ్తూ వెళ్తూ బీరువాకు నిప్పు అంటించి వెళ్లారు. తీరా సుజాతమ్మ ఇంటికి వచ్చే సరికి మేడపై నుంచి పొగలు రావడంతో హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే బీరువా తగలపడిపోయింది. అందులో ఉన్న బట్టలతో పాటు రూ. 10 వేల నగదు కూడా అగ్నికి ఆహుతైంది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని కోవూరు పోలీసులు పరిశీలించారు.

# కావలి నియోజకవర్గంలో రెండు పంటలు పండించేలా సాగునీరు అందిస్తా !



కావలి, జులై 20 ప్రభాతవార్త కావలి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో రెండు పంటలు పండించేలా సాగునీరు అందిస్తానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ పార్కు సమావేశ మందిరంలో ది కావలి ఫర్టిలైజర్స్ ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా దుశ్శాలువలతో, పూలమాలలతో సత్కరించారు. అందరిని ఆకర్షించేలా రైతు గెటప్ చిత్రాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య మాట్లాడారు. నెల్లూరు, సర్వేపల్లి తదితర ప్రాంతాలలో ఎక్కువ పరిశ్రమలు రావడం జరిగింద న్నారు. అక్కడ ఆయకట్టు తగ్గిందన్నారు. అయినప్పటికీ నాయకులు ఆ ప్రాంతానికే పాత పద్దతిలోనే సాగునీరు తీసుకుని వెళుతున్నారన్నారు. సాగునీరు కావలి నియోజకవర్గానికి ఎక్కువ కేటాయించేలా కృషి చేస్తానన్నారు. రైతులు అధిక సాగు చేయడం ద్వారా ఫర్టిలైజర్స్ వ్యాపారులకు వ్యాపారం బాగా జరుగుతుందని తెలిపారు. వ్యాపారస్తులకు వున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కావలి నియోజకవర్గంలోని వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుని సేవా మార్గం వైపు కొంత మనసు పెట్టాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు నేరెళ్ళ జ్వాలారావు, బచ్చు వీరాస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, టిడిపి లీగల్ సెల్ నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, మాజీ మండలాధ్యక్షుడు నాయుడు రాంప్రసాద్, ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అధికారులు, యువ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు కార్డులు పంపిణీ



**బుచ్చి జులై 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి జొన్నవాడ గ్రామాలలో కౌలు రైతుల కార్డులు రైతులకు అందించి వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు పంట సాగుదారులికి హక్కు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేయడం జరుగుతుందని తెలియజేశారు. కౌలు రైతులను ప్రభుత్వ గుర్తించి వారికి కౌలు కార్డులను పంపీణి చేయడం జరుగుతుందని ఈకార్యక్రమంలో వివరించారు. ఈకార్యక్రమంలో జొన్నవాడ గ్రామ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, విఆర్ఒలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## అనాధ మహిళకు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ



**బిట్రగుంట, జులై 20 ప్రభాతవార్త :** ఉమ్మడి ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం గుడ్లూరులో మతిస్థిమితం లేక రోడ్డు మీద ఆకలితో అలమటిస్తూ తిరుగుతున్న 50 సంవత్సరాల వయసున్న మహిళ గురించి తెలుసుకున్న బోగోలు మండలం ముంగమూరులోని భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కట్టిపల్లి శ్రావణ్‌కుమార్ గుడ్లూరు నుండి తీసుకొచ్చి ఆదరణ కేంద్రంలో చేర్పించి అక్కునచేర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆదరణ కేంద్రంలో ఇప్పటికే 30 మందికిపైగా నిరాశ్రయులకు ఆశ్రయిస్తున్నామని తెలిపారు. ఈ రోజు ఆదరణ లేక రోడ్డు మీద తిరుగుతున్న మహిళను చేరదీసి ఆదరణ కల్పించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఆమెను మాములు మనిషిగా తయారు చేసి కన్నతల్లిగా చూసుకుంటామని తెలిపారు.

## మన్నేటికోటలో కుష్టువ్యాధి సర్వే



**ఉలవపాడు, జులై 20, ప్రభాతవార్త :** మండలంలోని మన్నేటికోట గ్రామం నందు (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెనింగ్) కుష్టువ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని కరేడు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించి ఎవరికైనా శరీరంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు లేదా పొడలు ఉన్నచో సంబంధిత ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే కార్యక్రమానికి వస్తారని, వారికి చూపించిన వారు ఆ మచ్చలు ఏ రకమైన మచ్చలో తెలియపరచడం జరుగుతుందని వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతుందని, ఎవరికైనా అనుమానం ఉన్న యెడల సంబంధిత ఆశా కార్యకర్తను కానీ ఆరోగ్య కార్యకర్తను గాని లేదా వైద్యాధికారిని గాని సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మణెమ్మ, ఏఎన్ఎం శోభ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ పాల్గొన్నారు.

## సయ్యదు ఇలియాస్‌ను ఆదుకున్న ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, జులై20, ప్రభాతవార్త :** వింజమూరులోని సుజాతనగర్ కాలనీకి చెందిన సయ్యద్ ఇలియాస్ శుక్రవారం అద్దాలు దింపే పనికి వెళ్ళి ప్రమాదవశాత్తు అద్దం గొంతులోకి దిగి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానిక మాశిలామణి వైద్యశాలలో ప్రధమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం చెన్నైకి తరలించారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వెంటనే స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు 20వేల రూపాయలను తక్షణ ఆర్థికసాయమందించారు. సిఎం రిలీఫ్ ఫండ్‌ద్వారా ఆర్థికసాయమందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

## సిసిఆర్‌సి మంజూరుపై అవగాహన



**వింజమూరు, జులై20, ప్రభాతవార్త :** మండలంలోని పంటసాగుదారుల హక్కుపత్రం మంజూరుపై శనివారం వ్యవసాయాధికారి శివనాగప్రసాద్ రైతులకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరూ సిసిఆర్‌సి కార్డు పొందాలన్నారు. కార్డులు పొందడం ద్వారా ఎరువులు, విత్తనాలు , ఇ-పంట నమోదు చేస్తారన్నారు. ఇన్‌ఫుట్ సబ్సిడీ కూడా అర్హులవుతారన్నారు. కౌలుకార్డుల ద్వారా బ్యాంక్ ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం మద్ధతు ధరతో పంటను అమ్మవచ్చన్నారు. రైతులు పంటసాగును లాభసాటిగా మార్చుకోవాలంటే భూసార పరిక్షలను చేయించాలన్నారు. పలు రకాల పంటలు, వాటిని ఆశించే తెగుళ్ళు వాటి నివారణ గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎఇఒ గాలి మనోహర్‌నాయుడు, కౌలు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



**కొడవలూరు జూలై 20 ప్రభాతవార్త:** జిల్లాలో సిజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కొడవలూరు మండలంలోని పారిశుధ్య కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ, వైధ్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలపి అయన క్షేత్రస్థాయిలో డయోరియా, సీజనల్ వ్యాధుల నిర్మూలనలకు చేపట్టిన కార్యక్రమాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అందిస్తున్న సేవలపై ఆరాతీసారు. అంతేకాక చెత్త తొలిగింపు, ధోమలు ప్రబలకుండా చేపట్టిన కార్యక్రమాలను పంచాయితీ అధికారులు కలెక్టర్ అనంద్‌కు వివరించారు. అంతేకాక పంచాయితీలో రోజువారు చేపడుతున్న కార్యక్రమాలను పంచాయితీ కార్యదర్శిలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖాదికారులు వ్యాక్సిన్లు సక్రమముగా వేస్తున్నారా, పౌష్టిక ఆహారం అంధిసున్నారా అనే విషయాలను స్వయంగా అయన ఒక ఇంటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అంతేకాక మండలంలో కాటువల్లో చెత్తను ఎప్పుడు తోలిగిస్తున్నారు, త్రాగు నీరు ఎలా ఉన్నాయి అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో చెత్త తోలిగింపు, కాలువలను శుభ్రం చేయడం వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని వారు అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అప్రమత్తంగా ప్రభుత్వ అదేశాల మేరకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయితీ అధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైధ్య ఆరోగ్యశాఖాధికారులు పెంచలయ్య, జిల్లా మలేరియా అదికారి హుస్సేనమ్మ, అడిషనల్ డీఎంఆండ్ హెచ్వో బ్రిజిత, తాసిల్ధార్లు, మెడికల్ ఆఫీసర్లు రామకృష్ణ మరియు ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యాధి నిర్మూలనకు యాంటీ లార్వా ఆపరేషన్



**రాపూరు, జూలై20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని కోత్తపేటలో మలేరియా వ్యాధి నివారణకు శనివారం వేపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది యాంటీ లార్వా అపరేషన్ నిర్వహించారు. కోత్తపేట ప్రాంతంలోని ఒక వ్యక్తి టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తు అనంతపురంలో వుంటు జ్వరంతో భాదపడుతు ఇంటికి వచ్చాడు. ఇతనికి రక్త పరిక్షలను నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది ఇతనికి మలేరియా పాజిటివ్‌గా గుర్తించారు. దీంతో భాదితుని ఇంటి చుట్టుపక్కలా 60 మంది రక్త నమూనాలు సేకరించారు. అలాగే 50 ఇళ్లకు 25 శాతం డబ్యూడిపి మాలాధియన్‌ను స్ప్రే చేశారు. దీంతో పాటు యాంటీ లార్వా ఆపరేషన్‌లో బాగంగా ఇంటి చుట్టుపక్కల మురుగు కాలువలలో అబేట్ ద్రావణం స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ లింగమూర్తి, సబ్ యూనిట్ అధికారి జె.వెంకటేశ్వర రావు, యంపిహెచ్ఇఓ అబ్దుల్ సలాం, హెల్త్ అసిస్టెంట్‌లు వరదయ్య,ప్రసాద్, అశాలు వున్నారు.

## పారిశుధ్యం పట్ల దృష్టి సారించాలి



**వింజమూరు, జులై20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండలాధ్యక్షులు ఇనగనూరి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపిపి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ముందుగా మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల తర్వాత తొలి సమావేశం కావడం, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు 'సిద్ధంగా ఉండాలన్నారు. తాగునీరు అందించాలన్నారు. మండల సమావేశంలో స్థానిక సర్పంచ్ సృజన మాట్లాడుతూ వింజమూరు పట్టణంలోని డ్రైనేజీ పనులకు సంబంధించిన పనుల బిల్లులు కావడం లేదని సంబంధిత శాఖ అధికారిని అడిగితే స్పందించడం లేదని సభ దృష్టికి తెచ్చింది. కేవలం ఉద్దేశపూర్వకంగానే ఎవరో ఒక నాయకుడి మాట విని తమ బిల్లులు ఉద్దేశపూర్వకంగానే ఆపుతున్నారని ఆ నాయకుడెవరో సభలో తెలపాలని ఆమె కోరారు. దాంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వరప్రసాద్ మాట్లాడుతూ ఏ నాయకుడు చెప్పినా అధికారులు బిల్లులు ఆపరని, పనిచేస్తే ఖచ్చితంగా బిల్లులు చేస్తారన్నారు. ఎన్నికల కోడ్‌లో డ్రైనేజీలు శుభ్రం చేయాలని సర్పంచ్ తన దృష్టికి తెచ్చిన మాట వాస్తవమేనని , ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల విధుల్లో ఉండడంతో పనులు జరిగే సమయంలో సంబంధిత సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షణలో పనులు చేయాలని సూచించానని అలా సర్పంచ్ చేయకపోవడంతోనే బిల్లులు చేయలేదన్నారు. దాంతో కొద్దిసేపు వాడి, వేడిగా చర్చ కొనసాగింది. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి తాను విధులు నిర్వహిస్తానే తప్ప ఏ నాయకుడు చెప్పినా బిల్లులు ఆపే పరిస్థితి ఉండదన్నారు. కేవలం ఉద్దేశపూర్వకంగానే తనను సర్పంచ్ నిలదీస్తున్నారన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ పనులు చేసే సమయంలో ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోగా పనులు విషయం అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమాత్రం భావ్యం కాదన్నారు. దాంతో ఎంపిపి మోహన్‌రెడ్డి సర్దిచెప్పడంతో సమావేశం ముగిసింది. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ రాజేష్‌బాబు, ఎంపిటిసి సభ్యులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు 4వ రోజు పోటెత్తిన భక్తులు



ఫోటోలు : నంద మాల్యాద్రి

## సరసమైన ధరలకు ప్రజలకు నిత్యావసర సరుకులు



**దగదర్తి, జులై 20 ప్రభాతవార్త :** ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని దగదర్తి తహాశీల్దార్ జాన్‌పీటర్ తెలిపారు. మండల కేంద్రమైన దగదర్తి గ్రామంలో శనివారం సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందించే కార్యక్రమాన్ని తహాశీల్దార్ ప్రారంభించారు. ప్రజలకు సబ్సిడీపై కందిపప్పును అందజేసి మాట్లాడారు. నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులో వుండేలా ప్రభుత్వం రేటు నిర్ణయించిందన్నారు. ఆ రేటు ప్రకారం రైతు బజార్లలో, రిటైల్ షాపుల్లో అమ్మకాలు జరపాలని కోరారు. ముఖ్యంగా అవసరమైన కందిపప్పు బజారులో 181 రూపాయలు వుండగా 160 రూపాయలకు అమ్మాలన్నారు. అధిక రేటుకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహాశీల్దార్ గోపికృష్ణ, విఆర్వో మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి



**కావలి రూరల్, జులై 20 ప్రభాతవార్త :** వర్షాకాలమైనందున గ్రామ పంచాయతీలలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కావలి ఎంపిడివో ఎస్.శ్రీధర్‌బాబు తెలిపారు. కావలి మండలంలోని చెన్నాయపాళెం, పెదపట్టపుపాళెం గ్రామ సచివాలయాలను శనివారం విస్తరణాధికారి మహేశ్వరితో కలిసి ఎంపిడివో పరిశీలించారు. అనంతరం పంచాయతీలో శానిటేషన్‌ను పరిశీలించారు. చెన్నాయపాళెంలో లెప్రసీ శిబిరాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. మీ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నాయపాళెం, పెదపట్టపుపాళెం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో మంచినీటి సదుపాయం కల్పిస్తాం



**అల్లూరు, జులై 20 ప్రభాతవార్త :** అల్లూరు నగర పంచాయతీ పరిధిలో మంచినీరు సరఫరా చేసే సిడబ్ల్యు స్కీమ్‌ను శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ తిరుమలరావు అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అల్లూరు ప్రజలకు మంచినీరు అందించే చెర్లో సంఘం వద్ద ఏర్పాటు చేసి వున్న మంచినీటి ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో తెలుగుదేశం పార్టీ నాయకుల చొరవతో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ తిరుమలరావు మాట్లాడుతూ తాగునీరు సరఫరా చేసే ట్యాంక్ వద్ద మోటార్లు, పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని వీటి మరమ్మతులకు సుమారు 70 లక్షల రూపాయలు ఖర్చవుతుందని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ రంగస్వామి, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులరెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, బిట్రగుంట వెంకటేశ్వరరెడ్డి, బిట్రగుంట వెంకట చైతన్యరెడ్డిలు పాల్గొన్నారు.

## ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మికి అండగా జనసేన



**ముత్తుకూరు, జులై 20, ప్రభాతవార్త :** ముత్తుకూరు పంచాయితీలో కోట్ల రూపాయిల అవినీతి పనులు జరిగాయని వాటిపై విచారణ జరపాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు గిరిజన మహిళ అయిన ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మి పంచాయితీలో జరిగిన అవినీతి పై బహిరంగ లేఖ రాయడం చాలా అభినందనీయమని జిల్లా జనసేన నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు, సర్వేపల్లి జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆమెను ఘనంగా సన్మానించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ మహిళను చూడకుండా వైసిపి నాయకులు ఉప సర్పంచ్ భర్త హేళనగా మాట్లాడడం సరికాదన్నారు. ముత్తుకూరు పంచాయితీలో జరిగిన అవినీతిపై సీరియస్‌గా తీసుకుని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా సిఎం చంద్రబాబు నాయుడుకి వివరించి అలాగే సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. బాధ్యులైన అధికారులను ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రహీం, మహిళా అధ్యక్షురాలు వాణి, భవాని, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిని నివారిద్దాం

**నెల్లూరు, జులై 20, ప్రభాతవార్త - వైద్యం :** కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తయారు చేసేందుకు కృషి చేద్దామని అడిషనల్ డిఎంహెచ్ఓ, జిల్లా కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. ఇంటింటా జరుగుతున్న లెప్రసీ సర్వేను శనివారం నగరంలోని ఎన్బీటీ కాలని, చంద్రమౌళి నగర్, జేవీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన తనిఖీ చేసారు. అనంతరం ఆ ప్రాంతాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వల్లి మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా కుష్టు వ్యాధి ప్రబలకుండా అరికట్టవచ్చన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలున్నా రాగి రంగులో పొడలు, నొప్పి కలిగించని పుండ్లు పాదాలలో, అరచేతిలలో ఉండడం, చెవి తమ్మెలు ముందంగా మారిపోవడం లాంటి లక్షణాలుంటే వైద్య శాఖ సిబ్బందికి తెలిపి సకాలంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా కుష్టు రాకుండా చేయవచ్చన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వాలంటీర్లు సర్వేను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణారోగ్య కేంద్రాల డాక్టర్లు రీనా భారతి, హిమదీప్తి, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డిపిఎంఓ డాక్టర్ బీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోటూరుపాడులో లెప్రసీ వ్యాధిగ్రస్తుని గుర్తింపు

**కోటూరుపాడు(రాపూరు), జూలై20ప్రభాతవార్త :** మండలంలోని సిద్ధవరం పంచాయితీలోని కోటూరుపాడు గ్రామంలో లెప్రసి వ్యాధి సర్వేలో బాగంగా శనివారం ఒక వ్యాధిగ్రస్తుని గుర్తించినట్లు వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సూర్యధర్మేంద్ర తెలిపారు. ఈ కేసు కన్ఫార్మ్ అయిన్న తరువాత అతనికి చికిత్స ప్రారంబించి వ్యాధి తగ్గే వరకు అన్ని విధాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వేపినాపి పిహెచ్‌సి పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో లేప్రసి సర్వేను ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్నారన్నారు. పాజిటివ్ కేసులు గుర్తిస్తే వారికి పరిక్షలను నిర్వహించి వ్యాధి నిర్ధారన తరువాత వారికి వైద్యం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట ఆరోగ్య కార్యకర్తలు, సిద్ధవరం సిహెచ్ఓ, అశా కార్యకర్త, 104 సిబ్బంది వున్నారు.



## వాటర్ ప్లాంట్లలో నీటి నమూనాలు సేకరణ




**పొదలకూరు, జులై 20, ప్రభాతవార్త :** వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులు భారిన ప్రజలు పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలలో భాగంగా పొదలకూరు పట్టణం పొదలకూరు 1వ, పొదలకూరు రెండవ సచివాలయం పరిధిలోని ఎనిమిది వాటర్ ప్లాంట్లలో నీరు సేకరించారు. వాటర్ ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి ఈ శాంపిల్స్‌ను 48 గంటల వరకు ఉంచి పరీక్షించడం జరుగుతుందపి ఆరోగ్య విస్తరణ అధికారి టి. రవి కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు వాటర్ ప్లాంట్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం ద్వారా వాటర్ క్యానులు, ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని మీ వద్దకు వచ్చి నీరు పట్టుకునే ప్రజలకు వారి యొక్క వాటర్ క్యాన్లను శుభ్రపరచుకోవాలని తెలిపారు. కలుషిత నీరు త్రాగడం వలన వాంతులు, విరోచనాలు, కామెర్లు, ఫ్లూ జ్వరాలు వచ్చే ప్రమాదముందని అందువల్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని త్రాగడం చాలా మంచిదని ప్రజలకు తెలిపారు. ప్రజలందరూ తాజా వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని ఆహార పదార్థాలపై మూతలు ఉంచుకోవాలని, ఆహార పదార్థాలపైన ఈగలు వాలకుండా మూతులు ఉంచుకోవాలని, కుళ్లిన, పాడైపోయిన నిల్వ ఉంచిన పదార్థాలను తినవద్దని, భుజించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారం భుజించాలని ప్రజలందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సచివాలయం 1 కార్యదర్శి షఫీ, పొదలకూరు 3 కార్యదర్శి వంశి, నాగేశ్వర రావు, ఆరోగ్య సహాయకులు ఎం. రాధాకుమారి, సాని శివప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు టి. సుమాంజలి, బి. మణించదన, సచివాలయ హెల్త్ సెక్రటరీ హైమావతి పాల్గొన్నారు.

## పారిశుధ్యం పనులు పరిశీలన



**సైదాపురం, జులై 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనంతమడుగు సచివాలయం పరిధిలో జరుగుతున్న పారిశుధ్యం పనులను ఎంపీడీఓ సుధాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బ్లీచింగ్ చల్లిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ అంటు వ్యాధులకు గురి కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## కలిగిరిలో ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు



**కలిగిరి, జూలై20, ప్రభాతవార్త ;** గురుపౌర్ణమిని పురస్కరించుకొని కలిగిరిలోని శ్రీ షిరిడీ సాయి బాబా మందిరంలో శనివారంనుండి గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమైనాయి. ఈసందర్బంగా మందిర పూజారి, మందిర నిర్వాహకులు మాట్లాడుతూ శనివారంనుండి మూడురోజులపాటు బాబా వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో శనివారం బాబాకు పాలాబిషేకం, ప్రత్యేకపూజలు హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆదివారం పాలాభిషేకం, ప్రత్యేకపూజలు, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మద్యాహ్నం బక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం ప్రత్యేక పూజలు, హారతి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సాహం కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి బక్తులు పెద్దఎత్తున పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలన్నారు.

## సచివాలయాన్ని యంపిడిఓ ఆకస్మిక తనిఖీలు




**కలిగిరి, జూలై20, ప్రభాతవార్త;** కలిగిరి మండల యంపిడిఓ రంగ సుబ్బరాయుడు సచివాలయ తనిఖీలతో సచివాలయ సిబ్బందికి చెమటలు పుట్టిస్తున్నారు. ప్రతి సచివయంలోనూ రికార్డులను క్షణంగా పరిశీలిస్తూ తప్పులనూ వేలెత్తిచూపడంతో ఎవరిపైన ఏతప్పుజరుగుతుందోనని సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మండలంలోని క్రిష్ణారెడ్డిపాళెం సచివాలయాన్ని యంపిడిఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యంపిడిఓ వెళ్లేసమయానికి సచివాలయ శిబ్బంది అందరూ హాజరు కాకపోవడంతో ఒకింత అసహనం వ్యక్తపరిచారు. మరియొకసారి ఇలాజరిగితే చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి తగు సూచనలు అందజేశరు. అదేవిధంగా గ్రామంలోని ఓహెచ్‌యస్ఆర్ స్టోర్స్‌వద్ద వాటర్ టెస్టింగ్‌నిర్వహించారు. ఈసందర్బంగా యంపిడిఓ యాట్లాడుతూ అందరూ సచివాలయ శిబ్బంది సమయ పాలన పాటించాలని సచివాలయాల్లోని అన్నిరికార్డులను సక్రమంగా నిర్వహంచాలన్నారు. ఈకార్యక్రమంలో చెంచుక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు జూలై 20 ప్రభాతవార్త :** పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న పశు సహాయకులు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో కోవూరు , విడవలూరు మండలాలకు సంబంధించిన పశు సహాయకులకు పశు సంవర్ధక శాఖకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సహాయకులు వారి వారి పరిధిలో ఉన్న పశు రైతులతో మమేకం కావడమే కాకుండా పశు సంవర్ధక శాఖకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేస్తున్న వివిధ పథకాలపై వారిలో అవగాహన పెంచేలా చూడాలన్నారు. ముఖ్యంగా కృత్రిమ గర్భధారణపై పశు రైతులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవడమే కాకుండా మేలుజాతి పశు ఉత్పత్తిపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పశు సహాయకులకు ఇప్పటివరకు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పరీక్షలు నిర్వహించారు.

## నేడు శాకాంబారి అలంకార మహోత్సవ ఆహ్వానం

**పొదలకూరు, జులై 20, ప్రభాతవార్త :** పొదకూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 21వ తేది ఆదివారం శాకాంబరి అలంకారం మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు శాకంబరి అలంకారం, సహస్రనామార్చన, 12 గంటలకు హారతి, తీర్థ ప్రసాదం వినియోగం జరుగుతుందన్నారు. శాకంబారీ అలంకారంలో పాల్గొనవల్సిన భక్తులందరూ అలంకారంకి కావాల్సిన కూరగాయలు, పండ్లు, పూలు, బియ్యం, నెయ్యి వంటి గోత్రనామాలు రాసి శనివారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు లేదా సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల లోపల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు నాగేశ్వర రావు స్వామికి అందజేయాలని తెలిపారు. ఈ శాకంబరి అలంకరణ కార్యక్రమానికి భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను స్వీకరించాలని తెలిపారు. నిత్య పూజకు 1116 దేవస్థానంకు చెల్లించి ముఖ్యమైన రోజులు పుట్టిన రోజు, పెళ్లిరోజు లేదా విశేషమైన రోజు గోత్రనామాలతో నిత్య పూజ కార్యక్రమంను చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440191438 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## డ్వామా పిడి ఆకస్మిక తనఖీ

**మర్రిపాడు, జులై20, ప్రభాతవార్త :** మర్రిపాడు మండల ఉపాదిహామీ కార్యాలయాన్ని శనివారం డ్వామా ఇన్‌చార్జ్ పిడి బి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం అపరిశుభ్రంగా ఉండడంతో ఆఫీస్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాదిహామీ పనులపై దృష్టి పెట్టకుండా ఆఫీస్‌లో ఎందుకున్నారంటూ సిబ్బందిని మందలించారు. మినిట్ బుక్స్, పలు ఫైల్స్‌ను పరిశీలించారు. నూతన ఉపాదిహామీ పనుల వివరాలను కార్యాలయ సిబ్బందికి తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ బీటెక్ విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు జూలై 20 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రవేశాలు పొందిన ప్రథమ బీటెక్ విద్యార్థులకు శనివారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి విద్యార్థులను కళాశాలకు పంపేలా తల్లిదండ్రులు తగు చొరవ తీసుకోవాలన్నారు. తమ కళాశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రత్యేక శిక్షణ కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను కూడా ప్రథమ బీటెక్ విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## పీటర్ సన్ కాలువ సైడ్ గోడ ధ్వంసం



**కోవూరు జూలై 20 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారి పీటర్ సన్ కాలువకు సంబంధించిన సైడ్ గోడ పలు ప్రాంతాల్లో ధ్వంసమైంది. ప్రస్తుతం ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు , లారీలు శరవేగంగా ప్రయాణిస్తున్నాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో ఎటువంటి విద్యుత్ లైట్లు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలు ఈ సైడ్ గోడ లేని కారణంగా కాలువలో పడి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు వెంటనే స్పందించి సైడ్ కాలువ గోడను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వాహనాలపై రవాణా శాఖ స్క్వాడ్ దాడులు



**కోవూరు జూలై 20 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ రాజరాజేశ్వరి గుడి సమీపంలో శనివారం సాయంత్రం రవాణా శాఖకు సంబంధించి స్పెషల్ స్క్వాడ్ ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా రహదారిలో ప్రయాణిస్తున్న ఆటోలు, లారీలపై స్క్వాడ్ అధికారి విఙ్ఞేశ్వరలాల్ కేసులు నమోదు చేశారు. పాటూరు రోడ్డు ప్రాంతంలో రవాణా శాఖ తనిఖీలు చేపట్టడంతో ఆ ప్రాంతం గుండా ప్రయాణించే పలు వాహనాలు మందబయలు సెంటర్‌లోనే ఆగిపోయాయి.

## నేడు రాపూరులో గురుపౌర్ణమి వేడుకలు

**రాపూరు, జూలై20ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో బాగంగా దాబలచెరువు వద్ద వున్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆలయం, రాపూరులోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలో బాగంగా ఉదయం అబిషేకాలు, పూలాంగీ సేవ , మద్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రి భజనా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించునున్నారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.

## జోరేపల్లిలో అతిసార వ్యాధిపై అవగాహనా ర్యాలీ



**జోరేపల్లి(రాపూరు), జూలై20ప్రభాతవార్త :** మండలంలోని జోరేపల్లి గ్రామంలో శనివారం అతిసార వ్యాధిపై అవగాహనా ర్యాలీని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రమీలా రాజకుమారి నేతృత్వంలో నిర్వహించరు. ఇందులో బాగంగా గ్రామంలోన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అతిసార వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహెచ్ఓ నజిమున్నీసా, సూపర్‌వైజర్ ఇందిరమ్మ, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, అశాలు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రవేటు పాఠశాలలు
## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**బుచ్చి జూలై 20 ప్రభాతవార్త** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రవేటు పాఠశాలలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కృషి చేస్తున్నారని కోవూరు శాసనసభ్యురాలు వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మినగల్లు హైస్కూల్‌లో విద్యార్ధులకు కిట్లు పంపిణి చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యారంగానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. విద్యార్దులు బాగా చదువుకొని ఉన్నత స్దితికి ఎదిగేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా కృషి చేయలని ఆమె సూచించారు. స్దానిక నాయకులు పాఠశాలపైన దృష్టి పెట్టి ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసు కొని రావాలని ఆమె సూచించారు. విద్యార్ధులకు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యాభ్యాసం చెబుతున్నారన్న నమ్మకం కల్పించాలని ఆమె కోరారు. అనంతరం డిఇఒ మాట్లాడుతు ఈ సంవత్సరం రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాలలో నెల్లూరు జిల్లా ప్రధమస్దానంలో నిలిచిందని ఆయన ప్రశంసించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మధ్యహ్న బోజనం పెడుతుందని ఆయన తెలిపారు. పో షక విలువలు ఉన్న బోజనాన్ని తినే విదంగా తల్లిదండ్రులు కూడా విద్యార్దుల తిండిపై ప్రత్యేక దృష్టి పెట్టా లని అన్నారు. ప్రభుత్వం విద్యార్దుల అభ్యున్నతికోసం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. డ్రాప్‌వుట్స్‌ను తగ్గించి విద్యార్ధులందరు పాఠశాలకు వచ్చే విధంగా చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయ కులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, ఎంపిడిఒ రాజేశ్వరీ, ఎంఇఒ దీలీప్‌కుమార్, ఎంఇఒ రత్నం, బిసి నాయకులు బత్తల హరికృష్ణా, వింజం రామానాయుడు, గ్రామ సర్పంచ్ బొర్రు పూజిత, జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, సూరా శ్రీనివాసులురెడ్డి, మిన గల్లు నాయకులు కోటంరెడ్డి సురేష్‌రెడ్డి, బొర్రురాము, శశిదర్‌రెడ్డి, అంకయ్య, నరసింహాలు, నాగరాజు, అశోక్, బుచ్చి నాయకులు దశరద్‌కుమార్, రేబాల నాయకులు లఘంతోటి మస్తానయ్య, కావలి వెంకటేశ్వర్లు, తమ్మి రెడ్డిమల్లికార్జున, జొన్నవాడ గ్రామ సర్పంచ్‌పెంచలయ్య, పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షా ఫలితాలలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం



**కావలి రూరల్, జులై 20 ప్రభాతవార్త** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాలలో కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల విద్యా ర్థినీ, విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. బిఎ డిగ్రీ కోర్సులోని ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. బిఎస్సీ కోర్సు నందు ఫిజిక్స్, బాటనీ, జువాల జీలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. బిఎస్సీ, యంఎస్‌సిఎస్ గ్రూపు నందు షేక్ షబీనా 9.83 గ్రేడ్ పాయింట్లు సాధించి కావలి టౌన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. బిఎస్సీ సిడిజెడ్ గ్రూపు నందు పి.నరేంద్ర, ఎన్.దివ్యలు యూని వర్శిటీ ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యా ర్థినీ, విద్యార్థులను విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యం నా యుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, అధ్యాపకులు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఫస్ట్ ఇయర్ కోర్సులలో బిఎస్సీ ఆనర్స్, ఫిజిక్స్, బోటనీ, కంప్యూటర్ సైన్స్, డెయిరీ సైన్స్, బిఎ ఆనర్స్, పొలిటికల్ సైన్స్, బికాం ఆనర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఒకేషనల్ ఆనర్స్, ఆక్వా కల్చర్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు.

## రొట్టెల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



**నెల్లూరు అర్బన్, జులై 20, ప్రభాతవార్త** నెల్లూరు బారాషహిద్ దర్గా రొట్టెల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు బారా షహీద్ దర్గా ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆయన మీడియా మాట్లాడుతూ నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా మంత్రుల సూచనలతో పాటు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రొట్టెల పండగను విజయవంతం చేసేందుకు అన్ని అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయంతో పని చేసి సహకరించారన్నారు. ఇప్పటికే 7 లక్షల మంది భక్తులు రొట్టెల పండగ హాజరై బారాషహిద్‌లను దర్శించుకున్నారన్నారు. గతంలో కంటే ఈ ఏడాది పారిశుద్యంతో పాటు మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి సారించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి భక్తులతో స్వయంగా మాట్లాడారని, బారాషాహిద్ దర్గా అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయిల నిధులను కూడా విడుదల చేస్తున్నట్లు ఆయన ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్ బాషా, సయ్యద్ సమీ, సాబీర్ ఖాన్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్దులకు విద్యాసామాగ్రి పంపిణి



బుచ్చి జులై 20 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలం రెడ్డిపాళెం గ్రామంలోని ఎంపిపి మండల ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న బాలబాలికలకు బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నోటిబుక్స్, పెన్సిల్స్ అందచేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ బి.వెంకటరమణారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని అన్నారు. సహారా ఎద్యుకేషనల్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అద్యక్షులు యజ్దానిభాషాని ఆయన అభినందించారు. యజ్దానిభాషా మాట్లాడుతు తాము చేస్తున్న కార్యక్రమాలకు సహాయసహాకారాలు అందిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బ్రీజాకుమారి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సొసైటీ అద్యక్షులు పటాన్ రహమతుల్లా పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ బాధితులకు చేయూత



ఉదయగిరి, జులై 20, ప్రభాతవార్త: మండల కేంద్ర మైన ఉదయగిరిలోని గండిపాలెం పిహెచ్సి పరి ధిలో డాక్టర్ శివకల్పన మెడికల్ ఆఫీసర్ తో కలిసి ఫ్లోరోసిస్ సమస్యతో ఇబ్బంది పడుతున్న వ్యక్తులకి వాకర్స్, లంబార్ బెల్ట్స్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్వి చింతల మరియు ఉదయగిరి బిట్ 1 స్కూల్స్ నందు ఫ్లోరోసిస్ స్క్రీ నింగ్ చేయటం జరిగింది. ఫ్లోరైడ్ కంటెంట్ ఎక్కువ ఉన్న నీటిని తాగితే ఫ్లోరోసిస్ సమస్యలు వచ్చే అవ కాశాలు ఉంటాయి అని తెలిపారు. ఫ్లోరైడ్ కంటెంట్ అధికంగా ఉండే టూత్పేస్ట్ వాడకం తగ్గించాలి అని చెప్పారు. ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న వారు క్యాల్షియం విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారపదార్దాలు పండ్లు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శివకుమారి సూపర్వైజర్ అంకమ్మ మన్సూర్‌లి హెల్త్ అసిస్టెంట్ ఎమెల్‌హెచ్‌పి అరుణ్ ఏఎన్‌ఎమ్ ఏళ్ళేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాయినాథునికి పూజలు



**కోవూరు జూలై 20 ప్రభాతవార్త :** కోవూ రులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయి మంది రంలో 22వ గురు పూ ర్ణిమ సప్తాహ మహోత్స వాల సందర్భంగా శని వారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం స్వామి వారికి సాయి సహస్ర నామా ర్చన, పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్ర మాన్ని కన్నులపండుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినామ సంకీర్తన, సత్సంగ కార్యక్రమాలను కన్నులపండుగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలుగా యనమల గోపి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని సంధ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

## జలాశయాన్ని తనిఖీ చేసిన ఇరిగేషన్ శాఖ నిపుణులు



**ఉదయగిరి, జులై 20, ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండిపాలెం గ్రామంలో చెంచురామయ్య జలాశయాన్ని ఇరిగే షన్ శాఖ డి.చంద్రమౌళితో కలిసి జిల్లా నిపుణుల శాఖ అధి కారులు పరిశీలించారు. జలశానికి కుడి ఎడమ తూములలో కొంత భాగం దెబ్బతిని నీరు వృధగా పోతుందని రాబోయే రోజుల్లో వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండేవిధంగా తూములకు మరమ్మతులు చేపడుతామని డి ఈ చంద్రమౌళి తెలిపారు. ఆయకట్టు రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రాజెక్టుకు ఎగువ నుండి వచ్చే ప్రతి చుక్కను ఒడిసిపట్టి ప్రజలకు రైతులకు నీటి అవసరాలను తీరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఏఈ వేణు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సర్వీస్ లో ప్రయాణికులకు ఇబ్బందులు



**ఉదయగిరి, జులై 20, ప్రభాతవార్త :** ఉదయగిరి మం డలంలో గల ఆర్టీసీ బస్సు డిపో నుండి ఈ నెలలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మరియు డిపో మేనేజర్ శ్రీనివాసులతో ప్రారంభించబడిన హైద రాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణికులకు ఆదిలోనే ఆందోళనకు గురి చేసింది. అధికారుల నిర్లక్ష్యమో లేక అవగాహన రిహిత్యము తెలియదు కానీ ఉదయగిరి నుండి హైదరాబాద్ బయలుదేరిన బస్సు తిరిగి ప్ర యాణంలో కనిగిరి దాటిన తర్వాత బస్సులో డీజల్ అయిపోయి మధ్యలో ఆగిపోయింది. కుండపోత వరషం ఒకపక్క డీజల్ అయిపోయి ఆగిపోయిన బస్సులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ప్రయా ణికులు తెలిపారు. ఎంతో ఆర్భాటంగా హైదరాబాద్కు సర్వీసులు నడుపుతున్నామన్న బస్సు డిపో అధికా రులు బస్సు నిర్వహణ పట్టించుకోకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. మధ్యదారిలో బస్సు ఆగిపోవడంతో కుండపోత వర్షంలో ప్రయాణికులు తడిసి ముద్దైపోయారు. ఈ విషయమై బస్సు డిపో మేనే జర్ శ్రీనివాసులను వివరణ కోరగా కొత్త బస్సులలో ఎలాంటి సాంకేతిక లోపం వలన మైలేజీ తగ్గిందని నిపుణుల చేత పరిశీలించి మరొకసారి ఇలాంటి ఇబ్బంది ప్రయాణికులకు ఎదురు కాకుండా చూస్తామని అన్నారు.

## సూర్యనారాయణ ఆశ్రమ స్థలం పై హక్కులు కల్పించాలి



**వింజమూరు, జులై20, ప్రభాతవార్త :** వింజమూరు మోటచింత ల పాళెం సమీపంలోని శ్రీ సూర్యనారాయణస్వామి ఆశ్రమస్థలం తనదే నని తనకు ఇప్పించాలంటూ సూర్యనారాయణస్వామి శిష్యుడు ము మ్మడి గోపాలకృష్ణ స్వామిజీ శనివారం వింజమూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని మండపం వద్ద మౌన నిరాహారదీక్ష చేపట్టారు. శ్రీ అవ ధూత సూర్యనారాయణస్వామి వద్ద గోపాల్‌కృష్ణ శిష్యరికం పొం దారు. ఆయన పరమపదించిన తర్వాత మోటచింతలపాళెం సమీపం లో గోపాలకృష్ణ స్వామిజీ పొలంలో తన గురువు సూర్యనారాయ ణ స్వామిని సమాధి చేశారు. అప్పటి నుండి స్వామివారికి పూజలు చేసు కుంటూ అన్నదానాలు , దైవకార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నా రు. స్వామివారికి గుడిని కూడా ఏర్పాటు చేశారన్నారు. 9సంవత్సరాల క్రితం అవధూత నారాయణస్వామి అల్లుడు గోదాల పెదపుల్లారెడ్డి ఆయన కుమారుడు గోదాల మహేంద్రకు బాధ్యతలు అప్పగించారు. ఆశ్రమ బాధ్యతలు తీసుకున్నవారు ఆశ్రమ నిర్వహణ సక్రమంగా చేయకపోగా స్వామిపేరుతో నగదు వసూలు చేసి సొంతఖర్చుకు ఉపయోగించుకుంటూ గతంలో చేసిన విధంగా అన్నదానాలు నామమాత్రంగా నిర్వహి స్తున్నా రని గోపాలకృష్ణ స్వామీజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు మహేంద్రను ఆశ్రమ నిర్వహణ తీరుగురించి అడగ్గా దుర్భాషలాడుతున్నారని గోపాలకృష్ణస్వామీజీ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో సదరు స్థలంపై కోర్టును ఆశ్రయించగా తనకే అనుకూలంగా తీర్పునిచ్చారని కోర్టు తీర్పును రెవెన్యూ, పోలీసు శాఖ వారికి అందజేశానన్నారు. వారు నిర్వాహకులను బయటకు పంపించకపోవడం తోతానే మౌనదీక్షకు పూనుకు న్నానని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.





## కోనలో వైభవంగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

పెంచలకోన(రాపూరు), జులై20 ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి కళ్యా ణోత్సవం శనివారంపెంచలకోనలోని స్వామి వారి ఆస్ధానమండపంలో వైభవంగా నిర్వ హించారు. ఇందులో బాగంగా తెల్లవారు జా మునస్వామి వారి మూలమూర్తికి అభిషేకం, పూలాంగి సేవ, గోపూజ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో స్వామి వారిని ఉభయదేవే రుల తో కలసి శోబాయమానంగా ఆలంకరింప చేసిన తదుపరివేదపండితులు వేద మంత్రో చ్చరణల మధ్య స్వామి అమ్మవార్ల కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వా మి, అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి, అమ్మవార్లకళ్యాణోత్స వాన్ని తిలకించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన వసతి ఏర్పాట్లను ఆలయ డిప్యూటీకమీషనర్ విజయ సాగర్ బాబు, , ఇతర సిబ్బంది పర్యవేక్షించగా, స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులురామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వా ములు శశి స్వామి, మధు స్వామి, వినోద్‌స్వామి, నాగరాజుస్వామి తదితరులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

## మున్సిపల్ డైలీ వేజ్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలి




**కావలి, జులై 20 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీలో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని, అడ్డదారిలో నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న 27 మంది మున్సిపల్ కార్మికులను తొలగించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లి వెంకయ్య డిమాండ్ చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మల్లి వెంకయ్య మాట్లాడుతూ కావలి మున్సిపాల్టీలో డైలీ వేజ్ కార్మికులకు నాలుగు నెలల జీతాలు ఇవ్వాలన్నారు. వారిని ఆప్కాస్‌లో కూడా చేర్చలేదన్నారు. వారి వివరాల్ని మున్సిపల్ అధికారులు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. వారికి వెంటనే జీతాలు ఇవ్వకపోతే సమ్మె బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. మున్సిపల్ కార్మికులు చనిపోయినా, రిటైర్ అయినా వారి పిల్లలకు కానీ, కుటుంబ సభ్యులకు కానీ ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కార్మికులుగా 27 మందిని తీసుకుని వారిలో 13 మందికి జీతాలు ఇస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఇలాంటి చర్యల్ని మున్సిపల్ అధికారులు ప్రోత్సహించడం మంచిపద్ధతి కాదని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు కొత్తగా తీసుకున్న 27 మంది కార్మికులపై సమగ్ర విచారణ జరిపి వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. డైలీ వేజ్ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్, కావలి పట్టణ అధ్యక్షుడు ఎండ్లూరి ఆదినారాయణ, కార్యదర్శి తన్నీరు వెంకటేష్, ఎఐటియుసి సహాయ కార్యదర్శి ఎండ్లూరి రవి, కార్మిక నాయకులు గుంజి అంకయ్య, బండారు రాజేష్, ఏసుపోగు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో మొక్కులు చెల్లించుకున్న జనసేన నేతలు



**నెల్లూరు, జులై20 ప్రభాతవార్త-విద్య** తమ అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్ర డిప్యూటీ సిఎంగా బాధ్యతలను చేపట్టడంతో తాము కోరుకున్న కోరిన నెరవేరినట్లైందని, వెంటనే నేడు మొక్కులు చెల్లించేందుకు దర్గాకు రావ టం జరిగిందని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుకుల కిషోర్ దంప తులు, కోర్ కమిటి సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్, జమీర్‌లు శుక్రవారం రొట్టెల పండుగను పురస్క రించుకుని నగరంలోని స్థానిక బారాషాహిద్ దర్గాకు విచ్చేసి స్వర్ణాల చెరువులో వారి మొక్కులను తీర్చు కున్నారు. అనంతరం దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్ధలను గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతు సంకల్ప దీక్షతో ముందుకు సాగుతున్న తమ అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ గత నాలుగేళ్లుగా రొట్టెల పండుగ రోజున రొట్టెలు పట్టుకోవటం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తమను ఆదరించారని, అధ్యతిక మెజారిటీతో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి రావటం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తమ పార్టీ అబ్యర్దులు పోటీ చేసిన అన్నీ స్థానాల్లో విజయం సాదించి నూ టికి నూరుశాతం ఫలితాలు పొందంటం జరిగిందన్నారు. అలాగే ఎన్‌డిఏ ప్రభుత్వంలో తమ అదినేత డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారం చేయటం సంతోషంగా ఉదన్నారు. తమ తాము కోరుకున్న కోరికలను దర్గాలో అమరులైన 12మంది వీరులు తీర్చారని, అందుకోసమే మెక్కులు చెల్లించేందుకు రావటం జరి గిందన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి సంతోషంగా జరపుకునే పండుగ రొట్టెల పండు గఅని, ఇలాంటి పండుగకు నెల్లూరు వేదిక కావటం గర్వంగా ఉందన్నారు. తమలాగే వేలమంది భక్తులు దేశ విదేశాల నుండి వచ్చి వారి మొక్కులు చెల్లించుకోవటం చూస్తుంటే భక్తుల విశ్వాసం అర్ధమౌతుందన్నారు. అలగే లక్షల మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా దగ్గరుండి అన్నీ చర్యలు తీసుకుంటున్న మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు, జిల్లా అధికార యంత్రాగానికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులు




**ఉదయగిరి, జులై 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉతయగిరిలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మూలే పద్మజా వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మట్ల శాంతి ఎంపిటీసీ సభ్యులు మోడీ రామాంజనేయులు మైలే వినయ్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. ఉదయగిరి మండలానికి చెందిన ఎంపీటీసులు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొనగా మండలంలో అభివృద్ది రైతులకు సాగునీరు త్రాగునీరు, కరెం ట సమస్యలను ప్రధానంగా చర్చించారు. ముఖ్యమైన వైద్య విద్యుత్ శాఖ విద్యాశాఖల ప్రధాని అధికారులు పాల్గొనకపోవడం సమస్యలను పరిష్కరించడానికి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని నలువురు ఎంపీటీసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయగిరి లోనే ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందడం లేదని రోగుల పట్ల జాలి కూడా లేకుండా వైద్య సిబ్బంది కఠినంగా ప్రవర్తిస్తున్నారని పుల్లాయపల్లి ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. తాము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పే అధికారులు లేక తమ సమస్యలను తామే చెప్పుకున్నట్లు అయిందని నామమాత్రపు సర్వసభ్య సమావేశం నిర్వహించడం దేనికని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం నిర్వహణలో ప్రోటోకాల్ పాటించలేదని ముఖ్య మంత్రి ఫోటో గానీ ఉదయగిరి నియోజకవర్గం శాసన సభ్యులు ఫోటోలు గాని ఎక్కడ ప్రదర్శించకపోవడం శోచనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. పలు ప్రాంతాలలో ముఖ్యంగా ఉదయగిరిలోని ఎస్టీ కాలనీలో త్రాగునీటి సమస్య అధికంగా ఉన్న పట్టించుకునే నాధులే లేరని అన్నారు. ఉదయగిరి బస్టాండ్ సెంటర్లో ఉన్న బస్సెల్టరు పంచాయతీ ఆధ్వర్యంలో ఉండటంతో నిర్వహణ లేక పశువులకు మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యవంతంగా లేదని సమావేశంలో ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాసులు ఒక సందర్భంలో మాట్లాడుతూ పంచాయతీ శాఖ వాళ్ళ బస్సు షెల్టరు కార్యనిర్వాహన తమకు అప్పగించినట్లయితే ప్రయోజకరంగా మార్చి ప్రయాణికులకు మెరుగైన వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. అంతే కాకుండా ఉదయగిరిలోని మురుగు కాలువలు వర్షాకాలంలో ఎక్కడికక్కడ బ్లాక్ అయిపోయి దర్గంధ భరితంగా మారాయని కుక్కల బెడద ఎక్కువగా ఉందని బస్టాండ్ సెంటర్లో ఇవులు పదులు సంఖ్యలో అక్కడే ఉండదంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు ఎంపీడీవో దృష్టికి సమస్యను తెలియజేశారు. ఉదయగిరిలోని మండలాల పరిధిలో రైతులకు ప్రజలకు ఉపయోగం ఉండే విధంగా గ్రామాలలో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి వారి సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ద్వితీయ శ్రేణి అధికారులు పాల్గొనగా ముఖ్యమైన శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరయ్యారు.

## మాచవరం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ



**కందుకూరు జూలై 20, ప్రభాతవార్త** కందుకూరు మండలంలోని మాచవరం ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం క్షయవ్యాధి నియంత్రణాధికారిణి టి.నీరద సందర్శించారు. ఈ సందర్భంగా టీబీ లాబ్ టెస్టింగ్ రికార్డులు, పేషంట్స్ ఆరోగ్యరికార్డులు, పరిశీలించారు. వైద్యశాల పరిసరాలలో పారిశుద్యచర్యలును పరిశీలించారు. వెమెరుగైన వైద్యం అందించడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎస్‌డి జువేరియాబానున,న డా॥రాకేష్‌కుమార్, సిబ్బంది శివ, పరూక్, మంజులు, డి.విష్ణుతేజ, శ్రావణసంధ్య, ఎం.శ్రీనివాసరావు, సుశీల తదితరులు ఉన్నారు.